
ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



సాంకేతిక శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్ర ప్రదేశ్ నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సాంకేతిక శిక్షణకు నిరుద్యోగ యువతి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులకు ఫ్రంటె లైన్ ఆఫీస్ ఆసోసియేట్స్ చింతపల్లిలోను, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రిషియన్ శిక్షణ అరకు వ్యాలీ లోను, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ పాడేరు లోను, 8వ తరగతి అర్హతి కలిగిన అభ్యర్థులకు పాడేరు లోను లైట్ మోటార్ వెహిల్ డ్రై వింగ్ శిక్షణను అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఫిబ్రవరి 7వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. శిక్షణ పర్యవేక్షణకు యం.సతీష్ కుమార్ ను ప్లేస్మెంట్ అధికారిగా నియమించామని ఇతర వివరాలకు ఫోన్:93983 38105 మొబైల్ నెంబరులో సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని..

వెలుగు ఉద్యోగుల సమ్మె



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పాడేరు డివిజన్లోని వైయస్సార్ క్రాంతి పదం (వైయస్సార్ కెపి) (వెలుగు) ఉద్యోగులు సోమవారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రం పాడేరులో డిఆర్డిఏ పిడి ఐటిడిఏ ఏపీవో, డిఆర్ఓలకు తమ సమస్యలపై వినతి పత్రాలతో పాటు సమ్మె నోటీసులను జేఏసీ నాయకులు అందజేశారు. ఈ సమ్మెను ఉద్దేశించి అల్లూరి జిల్లా జేఏసీ అధ్యక్ష కార్యదర్శులు జే చిన్నారావు, ఎస్.నారాయణరావు మాట్లాడుతూ, తక్షణమే ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ, పే స్కేలు అమలు చేయాలన్నారు. సర్వీసు రెగ్యులర్ చేసి, ప్రస్తుతం ఉన్న ఈపీఎఫ్ సీలింగ్ విధానం తీసివేసి మూలవేతనంపై 100శాతం ఈపీఎఫ్ ను ఇవ్వాలన్నారు. ఎమ్మెస్సీలకు 12వ సెర్ప్ ఈసీ ఇచ్చిన తీర్మానం ప్రకారం హెచ్ఆర్ పాలసీను అమలు చేస్తూ. పే స్కేల్ వర్తింప చేయాలని. డిమాండ్ చేశారు. సపోర్టింగ్ స్టాప్, అన్ని కేడర్లకి పదోన్నతి, ఇంక్రిమెంట్ ఇవ్వాలని, సెర్ప్ హెచ్.ఆర్. పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ వర్తింప చేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని తెలిపారు. సెర్ప్లో కారుణ్య నియామకాలు జరిపి మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచి, ప్రభుత్వ ఉద్యోగస్తులకు అమలు చేస్తున్న గ్రాడ్యుటి 16 లక్షలు, తదితర సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కోశాధికారి ప్రసాద్, వివిధ మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం ఏదీ?

పాడేరు డివిజన్లోని 11 మండలాల్లో పనిచేస్తున్న సుమారు 140 మంది ఉద్యోగులు నేటి నుంచి సమ్మెకు దిగారు. జిల్లాలోని రంపచోడవరం డివిజన్లో ఇప్పటికే వైయస్సార్ కేపీ ఉద్యోగులు సమ్మె కొనసాగిస్తున్నారు. ఆ శాఖ ఉద్యోగులు విలేకర్లతో తమ సమస్యలను వెల్లడిసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులందరూ గడిచిన 23 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలలో భాగంగా వై.ఎస్.ఆర్.ఆసరా, వై.ఎస్.ఆర్. చేయూత, నాడు-నేడు, వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణం, బ్యాంకు లింకేజి రుణాలు, మహిళా మార్టులు, పేదలకు సుస్థిర జీవనోపాదులు పెంపుదల వంటి సంక్షేమ పథకాలు అమలులో కీలక పాత్ర నిర్వహిస్తున్నారు. గత 3 సంవత్సరములుగా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. అన్ని జిల్లాల్లో ఉద్యోగులంతా ఏకమై సమ్మెకు ఉపక్రమించారు.



మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన టెన్త్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లీష్ మీడియం విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లను అమరజీవులు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ సున్నం రాజయ్య, మాజీ ఎంపిపి కామ్రేడ్ కారం శిర్మయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో యుటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటియఫ్ మండల అధ్యక్షులు బొగ్గ ముత్తయ్య, జిల్లా కార్యదర్శి పండా కిష్టయ్య మార్చి మాసంలో జరిగే పదో తరగతి పరీక్షలకు ఈ మోడల్ పేపర్లు చాలా ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికావద్దని, మంచిగా చదివి పరీక్షలు బాగా రాయాలని సూచించారు. ఎం.సోమరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.బ్రహ్మయ్య, ఎం.అప్పారావు, చైతన్య, మధు, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

100 మెట్రిక్ టన్నుల మిరియాల కొనుగోలు లక్ష్యం

- కిలోకు రూ.500 మద్దతు ధర - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్కుమార్

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన రైతుల నుండి వంద మెట్రిక్ టన్నుల మిరియాలు కొనుగోలు చేయడానికి లక్ష్యంగా నిర్దేశించామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అధికారులను ఆదేశించారు. 11 మండలాల వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులు, కాఫీ లైజన్ వర్కర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిరియాల కొనుగోలుపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మిరియాలను దళారులకు తక్కువ ధరకు విక్రయించకుండా రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేసారు. కొయ్యూరు మినహా ప్రతీ మండలంలో పది మెట్రిక్ టన్నుల మిరియాల కొనుగోలు చేస్తామన్నారు. కిలో మిరియాలకు రూ.500లు రైతులకు చెల్లిస్తామని తెలిపారు. మిరియాల ఉత్పత్తిలో తగిన నాణ్యతలను పాటించాలని, తేమ తక్కువగా ఉండాలని సూచించారు. మిరియాలు సరఫరా చేసిన రైతులకు చెల్లింపులలో ఎటువంటి జాప్యం జరగదని చెప్పారు. ఉద్యాన వన అధికారులు, లైజాన్ వర్కర్లు వచ్చే నెల 1వ తేదీ నుండి 15 వ తేదీ గ్రామాల్లో పర్యటించి మిరియాల రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మిరియాలు నిల్వ చేయడానికి గిరిజన రైతులకు గోని సంచులను ఉచితంగా సరఫరా చేస్తామన్నార. 10 వేల ఎకరాల్లో కాఫీ కన్సాలిడేషన్కు ప్రతి పాదనలు సమర్పించాలని అన్నారు.

స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కల్యాణి మాట్లాడుతూ, గిరిజన రైతులు తోటల నుండి సేవకరించిన మిరియాల నూర్పిడిలో యంత్ర పరికరాలను వినియోగించాలని సూచించారు. కంకుల నుండి మిరియాలను వేరు చేయడానికి కాళ్లతో తొక్కడంతో బాక్టీరియా సోకి నాణ్యత తగ్గి పోతుందన్నారు. మిరియాలు నల్లగా ఉంటే మంచి ధర పలుకుతుందన్నారు. పచ్చి మిరియాలను ఒక నిమిషం వేడి నీటిలో ముంచి తీసి ఎండ బెడితే నల్లగా ఉండి మంచి ధర వస్తుందని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్, కాఫీ బోర్డు డిడి. రమేష్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్రావు, 11 మండలాల వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, లైజన్ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

-జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ సారవానివాని పాలెం గ్రామంలో నెల కొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జడ్పీటీసీ నిధులతో బోరు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తానని జడ్పీటీసీ దీసరి గంగరాజు అన్నారు. సోమవారం గ్రామంలో జెఈ తోపాటు సందర్శించారు. తాగునీటి సమస్యపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోరు, ట్యాంక్, సోలార్ పథకం పని చేయకపోవడంతో మంచి నీటి సరఫరా నిలిచి పోయిందన్నారు. గ్రామంలో ప్రజల ఇబ్బందుల రీత్యా జడ్పీటీటి నిధులతో బోరు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబ్ల్యూ.ఎస్ జెఈ గౌతం, స్థానిక ఎంపిటిసి మూతి బోయిన సన్యాసిరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు కాకర సింగులు, మామిడి కృష్ణ, గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు , గ్రామస్తులు పాల్గొన్నారు.



పవర్ కెనాల్ లీకేజీ గ్రౌటింగ్ పనులు చేపడుతున్న దృశ్యం

యుద్ధప్రాతిపదికన గ్రౌటింగ్ పనులు

ప్రజాశక్తి -సీలేరు


సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి పవర్ కెనాల్ లీకేజీలు అరికట్టేందుకు గ్రౌటింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సోమవారం పూర్తి చేశామని ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి. ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రిచ్ వన్ 2/4 వద్ద కెనాల్ లోపల భాగం నుంచి బయటికి నీరు లీకేజీ అవుతున్నట్లు కెనాల్ పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించినట్లు తెలిపారు. దీంతో లీకేజీ అరికట్టడానికి గ్రౌటింగ్ పనులు శరవేయంగా నిర్వహించి పూర్తి చేశామన్నారు. సోమవారం సాయంత్రం డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో ఏపీ జెన్కో ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి పవర్ కెనాల్ ద్వారా నీటి విడుదల కొనసాగించమని పేర్కొన్నారు. పవర్ కెనాల్లో నీటి విడుదల అనంతరం పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి చర్యలు చేపట్టామని వెల్లడించారు. పవర్ కెనాల్కి ఎటువంటి సమస్యలు ఇకనుంచి తలెత్తకుండా ఇంజనీర్లు పర్యవేక్షణలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు

టిడిపి పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని వంతడపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కిల్లు రమేష్ నాయుడు సోమవారం పర్యటించారు. తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం మేనిఫెస్టో, పథకాలు మన ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మార్చే విధంగా ఉందని కొనియాడారు. రాష్ట్రంలో నిరంకుశ పరిపాలనను సృష్టి పలకాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నేటికీ నాలుగున్నర సంవత్సరాలు దాటుతున్నా అభివృద్ధి కను చూపుమేర కనపడలేదని హెద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ బాలరాజు, మాజీ సర్పంచ్ రమాదేవి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అడపా నరసింహారెడ్డి నాయుడు, సాగేని. బొంజుపడల్. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శోభ శ్రీనివాసరావు, శివ కేశవ. శంకర్ నాయుడు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

69 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతగున్నలు గ్రామంలో వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయని దీంతో, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..సాధారణ వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్న సమాచారంతో అప్రమత్తమై వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. 69 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. 46 మందికి రాపిడ్ టెస్టులను చేయగా సాదరణ జ్వరాలుగా గుర్తించామన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరలక్ష్మి, శెట్టి నాగరాజు, ఎస్ పడాల్, నాగరాజు, వైవి రమణ, జెవి చలం, లాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లకు వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉపాధ్యాయులు లేని మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులకు విద్యనందించేందుకు ప్రభుత్వం నియమించిన సుమారు 118 మంది విద్యా వాలంటీర్లకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, తక్షణమే వారికి వేతన బకాయిలు ఇవ్వాలని ఐటిడిఎ స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒకు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. 2018-19 సంవత్సరంలో విద్యా వాలంటీర్లుగా నియమించిన వారికి నెలకు రూ.5వేలు చొప్పున వేతనాలు సుమారు నాలుగు నెలల పాటు చెల్లించలేదని తెలిపారు. వీరిలో ఎక్కువ శాతం వై.రామవరం మండలం అప్పర్ పార్ట్కి చెందినవారు ఉన్నారన్నారు. వీరికి సుమారు 23 లక్షల 60 వేల రూపాయలు చెల్లించాల్సి ఉందని, వాటిని వెంటనే చెల్లించాలని ఐటీడీఏ పీవోను కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ కుళాయిలు కనెక్షన్లు ఇవ్వాలని..

రంపచోడవరం మండలంలోని పెద్ద గెద్దాడ పంచాయతీ చెరువు పాలెం గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కులాయి ఏర్పాటు చేయగా, కొన్ని ఇళ్లకు మాత్రమే కుళాయి కనెక్షన్ ఇచ్చి, కొన్నింటికి ఇవ్వలేదని ఐటిడిఎ స్పందన కార్యక్రమంలో పిఒకి టిడిపి నాయకులు కారం సురేష్ బాబు వినతి పత్రం ఇచ్చారు. దీనికి పిఒ వెంటనే స్పందించి సంబంధిత అధికారిని పిలిచి సంబంధిత గ్రామానికి వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వంతల అచ్చియమ్మ, అన్నిక అప్పారావు, కాకర అబ్బులు, కాకర రాజబాబు, నేరం శేఖర్, వసికోన రమణ కుమార్, ఎన్నిక దుర్గారావు, కత్తుల కొమ్మిరెడ్డి, తుంబుడు రామకృష్ణారెడ్డి, కత్తుల కొమ్మిరెడ్డి, కాకర ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 61 అర్జీలు

స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 అర్జీలు అందాయి. వాటిని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబుసలాం, ఏడియంహెచ్ఓ జి.ప్రకాశం, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డిఎల్పిఓ రాఘవన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్రాజ్, సుబ్బయ్య, ఎ.రవికుమార్, ఏడిఏ సిహెచ్కెవి.చౌదరి, పిఏఓ రాంబాబు, డాక్టర్ ఇందిర, సిడిపిఓ సంధ్యారాణి, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, మల్లికార్జునరావు, రామచంద్రమూర్తి, లీగల్ సెల్ డిప్యూటీ తాసిల్దార్ స్వామి, ఏఈ పి.వెంకటరమణ, న్యాయవాది యన్వివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్కుమార్

పోలవరం పరిహారం ఇచ్చేదెప్పుడు?

-ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఇప్పట్లో వచ్చే అవకాశం లేదని ఆందోళన చెందుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులుగా మారిని వారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన పరిహారం ఏళ్ల తరబడి అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విఆర్.పురం మండలంలో ఇటీవల కాలంలో సర్వేలు చేశారు. కొన్ని గ్రామాలకు ఇంటి వాల్యూవేషన్ కోసం పత్రాలు ఇచ్చారు. కాని పరిహారం చెల్లించడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన తమకు ఎందుకు ఇంత జాప్యం జరుగుతుందని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే చట్టం ప్రకారం రావాల్సిన ఇళ్ళ సొమ్ములు ప్రభుత్వం చెల్లించాలని ప్రజలు కోరుతున్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఎన్నికలు జరిగి కొత్త సర్కార్ వచ్చే వరకు పరిహారం అందే పరిస్థితి ఉండదని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేసిన అన్ని గ్రామాల నిర్వాసిత కుటుంబాలకు వెంటనే పత్రాలు పరిహారం సొమ్ములు జమ చేయాలని మండలంలోని నిర్వాసితులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

త్వరలో విజయవాడ - రేఖపల్లి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి- కూనవరం

కూనవరం, విఆర్.పురం, ఎటపాక మండలాల ప్రజలు ఉపయోగకరంగా విజయవాడ-రేఖపల్లి బస్సు సర్వీసును త్వరలో ప్రారంభిస్తామని విజయవాడ డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుండి బస్సు లేక ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గతంలో విజయవాడ డిపిటివో, డిపో మేనేజర్కు మండల ప్రజలు తెలియజేశారు. దీనిపై డిపో మేనేజర్ స్పందించి రోడ్డు ప్రణాళిక తయారు చేసినట్లు చెప్పారు. విలీన మండలాల ప్రయాణికుల కొరకు విజయవాడ నుండి చింతూరు కల్లేరు వరకు వెళ్లే సర్వీస్ని ఒకటి కూనవరం, రేకపల్లి, చట్టి మీదుగా కల్లేరు వరకు వెళ్తుందని పేర్కొన్నారు. విజయవాడలో రాత్రి 11 గంటలకు బస్సు బయలుదేరి భద్రాచలం, కూనవరం, రేఖపల్లి నుండి చట్టి మీదుగా కల్లేరు వెళుతుందని, మళ్లీ రాత్రి 7 గంటలకు కల్లేరులో బయలుదేరి చట్టి, కూనవరం, రేఖపల్లి వెళ్లి, 8.30కు బయలుదేరి భద్రాచలం మీదుగా విజయవాడ చేరుకుంటుందని విజయవాడ డిపో మేనేజర్ తెలియజేశారు.

గుర్తేడులో వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వై.రామవరం మండలం గుర్తేడు గ్రామంలో అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రంపచోడవరం సిఐ వెంకటేశ్వరావు, మారేడుమిల్లి, గుర్తేడు, వై.రామవరం ఎస్ఐలు రాము, సాయికుమార్, సంతోష్ ఆధ్వర్యాన యువహో వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రంపచోడవరం ఎఎస్పి జగదీష్ ఆడహాల్లిను గుర్తేడు, పాత కోట సర్పంచ్లు సాలువ కప్పి సన్మానించారు. ఈ పోటీల్లో దాదాపుగా 35 జట్లు పాల్గొన్నాయి. వీరిలో మొదటి బహుమతి రెండవ బహుమతి మూడవ బహుమతి గెలిచిన టీములకు ఏఎస్పీ చేతుల మీదుగా నగదు బహూకరించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్క టీమ్కు వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పి జగదీష్ ఆడహల్లి మాట్లాడుతూ యువత గంజాయి, సారా, కోడి పందాలు, పేకాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే అప్రమత్తంగా ఉండి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దానికి కావలసిన ఏర్పాట్లను ఐటీడీఏ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే కొంతమంది యువతీ యువకులకు పోలీసు రిక్రూమెంట్ కొరకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ జి.దుశ్యంత్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఇలాంటి క్రీడా పోటీలు పెట్టి యువతకు మంచి మార్గాన్ని నిర్దేశిస్తున్న పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. మా ప్రాంతంలో రహదారి సౌకర్యం కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాతకోట, వై రామవరం, ధారగడ్డ సర్పంచులు, ఆరోగ్య సిబ్బంది, వివిధ గ్రామాల యువత పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రంపచోడవరం ఎఎస్పి జగదీష్

అంగన్వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని బడదనాంపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ దేవమణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 సంవత్సరాలు నిండిన గిరిజన వివాహిత అదే గ్రామానికి చెందిన కోడలై ఉండి, పదవ తరగతి ఉత్తీర్ణ సాధించిన వారు దీనికి అర్హులని, అటువంటి వారు ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి, రెండు పాస్పోర్టు సైజ్ ఫొటోలు, ఐదు రూపాయలు స్టాంపు కవరుతో ఐసిడిఎస్ కార్యాలయానికి ఫిబ్రవరి 10న సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు సమర్పించాలని కోరారు. నిర్దేశించబడిన ప్రదేశంలో మండల రెవెన్యూ అధికారి ధ్రువీకరించిన నివాస ధ్రువపత్రం సమర్పించాలన్నారు, దరఖాస్తు ఫారం కొరకు 10వ తేదీలోగా కార్యాలయం తెరిచి ఉన్న సమయంలో సంప్రదించాలని సిడిపిఓ దేవమణి తెలిపారు.

సిసి రోడ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తాడెపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో సిసి రోడ్డుకు ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ రేగం మత్స్యలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జెడ్పిటిసి మాట్లాడుతూ, మండల పరిషత్ నిధులు రు.2.00లక్షలతో 50మీటర్ల రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. గ్రామస్తులందరూ చక్కగా రోడ్డు వేయించుకొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కిలాగాఢ సింహాచలం, వార్డ్ మెంబర్ కిరసాని సుబ్బారావు, ఏఎంసి డైరెక్టర్ వెంకట్, వైస్సార్సీపీ నాయకులు తమర్భ రాజారావు పడల్, శివాజీ, వాలంటీర్ గుమ్మడి మత్స్యరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో రెండు అంగన్వాడీ పోస్టులు భర్తీలకు నోటిఫికేషన్ విడుదలయ్యిందని ఇంచార్జి సీడీపీఓ కె సింహాచలం సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికులు, పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి నిర్దేశించిన గ్రామంలో వివాహితురాలై ఉండాలన్నారు.

దరఖాస్తులు ఆన్ లైన్ లేదా తపాలా లేదా నేరుగా తమ కార్యాలయానికి ఫిబ్రవరి పదవ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పంపాలన్నారు. సీతాగుంట పంచాయతీ ముసిడిపుట్టులో మెయిన్ అంగన్వాడీ, లక్ష్మీపేట పంచాయతీ కీలుములు గ్రామంలో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

సెక్రటరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని జీనబాడు పంచాయతీ పెద్దగంగవరం గ్రామంలో గిరిజనేతరులకు ఇంటిపన్ను రసీదులు జారీ చేసి 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్న జీనబాడు సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని అనంతగిరి ఎంపిడిఒ, తహశీల్దార్‌లకు సోమవారం జడ్పిటిసి దీసరి, గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం, పీసా వంటి చట్టలను తుంగలో తొక్కిన సెక్రటరీ ఉమా దేవి పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: 516 ఈ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా కురిడి జంక్షన్ మీదుగా హైవే రోడ్డు నిర్మాణం చేశారు. కానీ అక్కడ బస్ సెంటర్ నిర్మించక పోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. గతంలో నిర్మించిన బస్ షెల్టర్ పూర్తిగా కుప్ప కూలే పరిస్థితిలో ఉంది. ప్రస్తుతం ఆ గ్రామస్తులు బస్సుల కోసం జంక్షన్లో వేచి ఉండడానికి సెంటర్ లేక హైవే రోడ్డు పైనే ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి జంక్షన్ లో బస్సు సెల్టర్ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలమైన బస్ షెల్టర్



పిఒ సూరజ్ గనోరేతో విద్యార్థులు

పిఒను కలిసిన రిపబ్లిక్ డేలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల్లో పాల్గొన్న గిరిజన పాఠశాలలకు చెందిన నలుగురు బాలబాలికలు సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరేను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి 15 మంది బాలికలు, 15 మంది బాలురు గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన మోట ఆధ్వర్యంలో రిపబ్లిక్ డేకు ఢిల్లీ వెళ్లడం జరిగిందని చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధి నుండి నలుగురు విద్యార్థులు, చింతూరు ఐటీడీఏ నుండి ఇద్దరు విద్యార్థులు వెళ్లినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చే వారిని భవిష్యత్తులోనూ స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే ఉత్సవాలకు ఢిల్లీ పంపడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబుసలాం, ఫిజికల్ డైరెక్టర్లు కె. తిరుపతిరావు, కె.రామాయమ్మ, డిప్యూటీ వార్డెన్ ఆదినారాయణ రెడ్డి, పిఈటి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

రాజన్న ఆటోనగర్ పనులు ప్రారంభించాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్మార్ట్ సిటీ విశాఖను స్క్రాప్ ఫ్రీ సిటీగా మార్చాలన్న లక్ష్యంతో అనందపురం మండలం కణమాం గ్రామంలో నిర్మించ తలపెట్టిన రాజన్న ఆటోనగర్ నిర్మాణ పనులకు వెంటనే శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రాజన్న ఆటోనగర్ స్క్రాప్, ఆటోమొబైల్, స్పేర్ పార్ట్స్ కార్మికుల అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న 20 వేల మంది కార్మికులకు అన్నం పెడుతున్న ఈ రంగం పట్ల స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్, ఎపిఐఐసి అధికారులు అదేపనిగా అబద్ధాలు చెప్పి కార్మికులకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఆటోనగర్ నిర్మాణానికి కావలసిన నిధులను ఇప్పటికే కేటాయించామని, నిర్మాణ పనుల బాధ్యత ఎపిఐఐసి వారికి అప్పగించామని కలెక్టర్ చెప్పారని, అయితే ఆయన చెప్పిన విషయం యదార్థం కాదని అన్నారు. ఈ నెల 21న స్క్రాప్ కార్మికులతో పాటు తాము కణమాం గ్రామానికి వెళ్లి చూడగా అక్కడ ఎటువంటి పనులూ చేపట్టలేదని తెలిపారు. అక్కడ ఫ్లాట్స్ వేసినట్లు ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. 157.77 ఎకరాలు ఉన్న ఈ స్థలాన్ని కాజేయాలని వైసిపి నాయకులు, ముఖ్యంగా భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయన అటువంటి ప్రయత్నాలను విరమించాలన్నారు. వైసిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు ఆడుతున్న నాటకాలను ఆపి వెంటనే ఆటోనగర్ నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. లేనిపక్షంలో మంత్రుల, ఎమ్మెల్యేల గృహాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. దక్షిణ ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను నియోజవర్గంలో తిరగకుండా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కె.గణేష్, కయ్యూమ్, సమీర్, రబ్బాని, షేక్ రియాజ్ పాల్గొన్నారు.

పివిటిజిల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాశక్తి-పాడేరు: పివిటిజిలకు సౌకర్యాల కల్పన దిశగా ప్రత్యేక దృష్టి సారించి సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కేంప్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పివిటిజి సర్వే, ఆధార్ కార్డులు, ఆయష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పివిటిజిల వద్ద సరైన డాక్యుమెంట్లు లేనందున ప్రభుత్వ పథకాలు అందుకోలేక పోతున్నారని, వారికి అవసరమైన బర్త్, ఆదార్, కేస్ట్, ఇన్కమ్ తదితర ధ్రువీకరణలు అందజేయాలని ఆదేశించారు. పివిటిజిలకు గృహాలు, గ్రామాలకు విధ్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా మరో రెండు నెలలలో ఆయా గ్రామాలకు విధ్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఆయష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో సరిగా స్పందించని అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం ఎంపిడిఓలకు షో కాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిని ఆదేశించారు. కొత్తగా సుమారు లక్షా 13 వేల ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని వాటిని వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సందర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో లేదా పరిసర ప్రాంతంలో ఒక రాత్రి నలుగురు సిబ్బంది స్టే చేయగలిగే అవకాశాలు పరిశీలించాలని ఎంపిడిఓలను ఆదేశిచారు. ఈ వీడియో సమావేశంలో ఆయా ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, డిఎల్డిఓలు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

పాడేరు: వ్యవసాయ శాఖ ప్లాంట్ డాక్టర్స్ డైరీ 2024 ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఆయన చాంబరులో ఆవిష్కరించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చిరుధాన్యాలతో వంద రకాల రుచికరమైన వంటల పుస్తకాన్ని వ్యవసాధికారుల 2024 క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరుధాన్యాలతో తయారు చేసే వివిద రకాల పంటలపై ముద్రించిన పుస్తకం ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కొర్రలు, సామలు, అరికలు, రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలతో రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలపై రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్.నంద్, సహాయ సంచాలకులు కె. జాహ్నవి, పి.మోహన రావు, వ్యవసాయాధికారుల అసోసియేషన్ సెక్రటరీ ఎల్. ఆర్. బి. పాత్రుడు, వైస్ ప్రెసిడెంట్ మధు, 11 మండలాల ఎఒలు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన అవసరం

రాష్ట్ర నేర పరిశోధన విభాగం సిఐ శ్రీనివాస్



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

ప్రజాశక్తి-చింతపల్లి: గిరిజన చట్టాలపై మన్యం వాసులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర నేర పరిశోధన విభాగం సిఐ జె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం చింతపల్లిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం అడిషనల్ డీజీపీ ఎన్ సంజయ్ ఆదేశాలతో గిరిజన చట్టాలు, హక్కులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పై గిరిజన విద్యార్థులకు, గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐడి సిఐ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గ్రామ వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి నేరాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టడం శుభ పరిణామమన్నారు. గిరిజనులకు సంబంధించిన లోకూర్ కమిటీ 1965, బురియా కమిషన్, పిసా చట్టాలపై వివరించారు. భారత ప్రభుత్వ చట్టం 1919, 1935 లపై అవగాహన కల్పించడంతో పాటు షెడ్యూల్డ్ ప్రాంతంలోని రాజ్యాంగంలో 244వ అధికరణ, ఐటీడీఏ విధానాలపై వివరించారు.

జడ్పిటిసి పోతురాజు బాలయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జీవో 3 పునరుద్ధించుకునేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐడి ఎస్ఐ ఎస్.రామారావు, ఎమ్మార్వో లచ్చాపాత్రుడు, ఎంపీపీ అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు షేక్ నాజర్ వలి, ఎంఈఓలు ప్రసాద్, బోడం నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ఏపీ సిఐడి ఎస్ఐ జివివి సత్యనారాయణ అన్నారు. ఏపీ సిఐడి శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు ఆధ్వర్యంలో మండలంలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అత్యాచారాలు, అకృత్యాలు, వాటి శిక్షలు, సామాజిక హక్కులు, వాటి రక్షణ, ప్రత్యేక కోర్టు గురించి రాజ్యాంగంలోని సెక్షన్ 3లో వివరించినట్లు చెప్పారు. సిఐడి యూట్యూబ్ వీడియోస్ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి తెలియజేశారు. రాజవొమ్మంగి తాహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు మాట్లాడుతూ గిరిజన చట్టాలపై అవగాహన కలిగి, అవసరమైనప్పుడు వాటిని వినియోగించాలని, అనవసరంగా దుర్వినియోగం చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, చికిలింత, గొబ్బిలిమడుగు సర్పంచులు కోండ్ల సూరిబాబు, చంద్రుడు, ఏపీ సిఐడి ఎస్ఐ కేవీవీ.శ్రీనివాస్, హెచ్‌సి సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, సుబ్బారావు, పెద్ద సంఖ్యలో గిరిజన యువత పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిఐడి ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో గిరిజన చట్టాలపై అవగాహన .కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అట్రాసిటీ కేసులపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, స్థానిక ఎస్సై అప్పలరాజు, ఈవోపీఆర్డీ చిన్నిబాబు, ఆదివాసీ నాయకులు సమర్ధ కృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక యువత శిక్షణ కేంద్రంలో ఏపీ సిఐడి, పోలీస్ వారి సమన్వయంతో గిరిజన తెగల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రి నేర పరిశోధన విభాగం సిఐ డి.విజయ్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐడి ఎసై అర్జున్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులపై విచారణ

ప్రజాశక్తి ముంచింగి పుట్టు:-మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులపై అక్రమ దాడులు, అక్రమ కేసులు పెట్టడంపై గత గురువారం మండల కేంద్రంలో లక్ష్మీపురం సర్పంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే. జిమాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్, ఎస్సైలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ విషయంపై సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ సోమవారం లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ప్రజలతో ముఖాముఖి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర.త్రినాథ్, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ, గిరిజనులను ఇబ్బందులకు గురి చేడం సరికాదన్నారు.సీఐ రమేష్ మాట్లాడుతూ, విచారణలో గిరిజనులు తెలిపిన విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

16న రవాణా రంగం బంద్

మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)



సమావేశ అనంతరం నినాదాలు చేస్తున్న మోటారు ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం డిసెంబర్ 25న ఆమోదించిన హిట్ అండ్ రన్ 106 (2) చట్టానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న రవాణా కార్మికులు దేశ వ్యాప్తంగా బంద్ చేపట్టనున్నట్లు విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ తెలిపింది. ఈ బంద్‌ను ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయవంతం చేయాలని రవాణా రంగ కార్మికులకు విజ్ఞప్తి చేసింది. సంఘం జిల్లా కమిటీ సమావేశం సోమవారం నగరంలో జరిగింది. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన రవాణా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్లతో బంద్ జరుగుతుందని చెప్పారు. ఏ చట్టం చేయాలన్నా లేక ఉన్న చట్టంలో సవరణలు చేయాలన్నా ప్రభుత్వం ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాలన్నారు. అలాగే చట్టం వర్తించే తరగతికి చెందిన సంస్థలు, ప్రముఖులతో సంప్రదించాలని తెలిపారు. ప్రస్తుత కొత్త క్రిమినల్ చట్టాలు తేవడానికి ముందు ఈ సాంప్రదాయాలన్నింటినీ కేంద్రం ఉల్లంఘించిందని మండిపడ్డారు. కనీసం పార్లమెంటులోనైనా సవివరమైన చర్చ జరగాలన్నారు. కానీ మొత్తం ప్రతిపక్షాన్ని సభ నుంచి గెంటి వేసి ఈ చట్టాలను ఆమోదింపజేసుకున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. కొత్త చట్టంలోని సెక్షన్ 106 (2) డ్రైవర్ల పాలిట ఉరితాడు అని తెలిపారు. సెక్షన్ 106 (1), (2)లోని శిక్షలు బ్రిటిష్ కాలం నాటి చట్టంలోని శిక్షల కంటే దారుణంగా ఉన్నాయన్నారు. వాస్తవానికి దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవేతర కారణాలతో జరుగుతున్నాయని ఇండియన్ న్యూస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఢిల్లీలో ప్రమాదాలపై అధ్యయనం చేస్తున్న ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారీ రుజువు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు కెజెఎ.రావు (శివ), కార్యదర్శి అప్పలరాజు, ఆర్టీసీ హైర్ బస్ అన్ని డిపోల నాయకులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ నాయకులు, మ్యాక్సీ క్యాబ్ నాయకులు, ఓలా, ఉబర్ కమిటీల నాయకులు, ఇతర మోటారు రంగాల నాయకులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు సాంకేతిక అధికారిగా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకూ చెన్నయ్‌లో జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు సాంకేతిక అధికారిగా విశాఖపట్నం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై.శర్మ నామినేట్ అయ్యారు. అయన ఇప్పటికే ఇంటర్నేషనల్ టాబ్లెట్‌నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి బ్లూబ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా గుర్తింపు పొందారు. అతని ఎంపికపై లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్ ప్రెసిడెంట్ కామేశ్వరి, జనరల్ సెక్రటరీ వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలియజేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూఢనమ్మకాలను సామాజిక సమస్యగా ప్రభుత్వం గుర్తించాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చార్వాక అన్నారు. విశాఖపట్నంలోని మద్దెలపాలెం కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపల్ బి.సుజాత అధ్యక్షతన 'నిత్య జీవితంలో మూఢ నమ్మకాల నిర్మూలన' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన చార్వాక మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలను నమ్మడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ఎస్ఎఫ్ నాయకులు ఉప్పులేటి నరేష్ ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఫిజిక్స్ లెక్చరర్ బి.కృష్ణారావు, బోసుబాబు పాల్గొన్నారు.

కార్ టైర్లు చోరీ



చోరీకి గురైన కారు టైర్లు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండల కేంద్రంలో యాక్సిడెంట్‌కు గురైన కారు టైర్లను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి దొంగలిచారు. మండల కేంద్రంలోని గ్యాస్ గోడౌన్‌కు ఎదురుగా సుమారు గత నెల రోజుల క్రితం కారు యాక్సిడెంట్ కు గురైంది. కారు నడుపుతున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన్ను హాస్పిటల్‌కి తరలించి కారుని ఇక్కడే విడిచిపెట్టారు. అప్పటి నుంచి ఈ కారును ప్రమాదానికి గురైన వారు తరలించక పోవడంతో ఇక్కడే ఉంది. ప్రమాదానికి గురైన కారును స్థానిక పోలీస్ స్టేషన్లో పోలీసులు కూడా తరలించక పోవడంతో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వెనుక భాగంలోని రెండు టైర్లను చోరీకి పాల్పడ్డారు. దీంతోపాటు రోజుకో భాగాన్ని దొంగలించుకుపోతున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు స్పందించి ప్రమాదానికి గురైన కారును స్టేషన్‌లో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్టు షాపులపై నిఘా



నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి- హుకుంపేట : మండలంలోని బెల్ట్ షాపులపై నిఘా పెట్టామని స్థానిక ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. మండలంలోని బి.బొడ్డపుట్టు పంచాయతీ డబ్బాగరు గ్రామానికి చెందిన కొర్రా ఈశ్వరరావు ఇంటి వద్ద బెల్ట్ షాపులు ఏర్పాటు చేశాడు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీ చేసి ఇంటి వద్ద 15 లీటర్ల నాటుసారా, 15 మద్యం బాటిల్లను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇదే గ్రామానికి చెందిన కొర్రా చిన్న దొన్ను నుంచి 35 లీటర్ల సారా పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై ప్రకటించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గిరిజన ప్రాంతంలో యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

పలుచోట్ల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితునితో పోలీసులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: పెదలోచలి పంచాయితీ సింధుగుల గ్రామంలో రవాణాకు సిద్ధంగా ఉన్న 130 కిలోల గంజాయిని సోమవారం జి.మాడుగుల పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు సింధుగుల గ్రామంలో గేమిలి చిరంజీవి ఇంటి వద్ద ఉంచిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్కు తరలించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిమాడుగుల: మండల కేంద్రానికి అనుకుని ఉన్న జిఎం కొత్తూరు జంక్షన్ వద్ద స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితుల పై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్టు ఆయన తెలిపారు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

జాతీయ రేలా ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-చింతూరు : ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ రేలా ఉత్సవాల కరపత్రాలను చింతూరు మండలం పేగ గ్రామంలో సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రచార కార్యదర్శి సోడే ముత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, ఆచారాలు, ఆత్మ గౌరవం, విద్య, వైద్యం కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందని చెప్పారు. ఈ సారి కోయ బాల సాహిత్యం , సామెతలు, పద్యాలు, చరిత్ర గురించి అవగాహన కల్పిస్తామని చెప్పారు. పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి కళాకారులు వచ్చి వారి కళా ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. ఆదివాసీ మేదావులు రేలా పండగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మెడికల్ యూనియన్ నుంచి తోడం కోటి, గోటుల్ నుండి సోడి శ్రీను, తొడం ముద్దరాజు, మల్లం ఆనంద్, కారం రవి, సరియం రాజకుమార్, మినప నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో మాంసం, చేపలు విక్రయించకూడదని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే దుకాణాలపై జివిఎంసి పశువైద్య విభాగపు సిబ్బంది అపరాధ రుసుము విధిస్తారని పేర్కొన్నారు. రూ.500 నుంచి రూ.5000 వరకు అపరాధ రుసుము విధించడంతో పాటు వారి వ్యాపార లైసెన్సులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుబడిన మాంసాన్ని సీజ్ చేస్తారని పేర్కొన్నారు.

చెడు అలవాట్లను వదిలేస్తేనే అభివృద్ధి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నూతన సామాజిక క్రమంవైపు వెళ్లాలంటే చెడు అలవాట్లను వదిలేయాలని, మనతోపాటు మిగిలిన వారిని మంచి కార్యక్రమాల్లో భాగస్వామిలను చేయాలని, అప్పుడే ప్రగతి సాధ్యమని సిఎంఎఫ్ఆర్ఐ ఇందిర అన్నారు. ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన వైజాగ్ సింపోజియం - 2024 కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు అభివృద్ధి పురోగతి-నూతన సామాజిక క్రమం అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం జ్యోతీశ్వరరావు, ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ షేక్ లా మహమ్మద్ ముందుగా మీరే ఆధారం కార్యక్రమాన్ని ప్రారంభించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశాఖ నగరంలో ఉన్న నీటి గుంటలు చెరువుల వివరాలు ఈ పుస్తకంలో పొందుపరచడం పట్ల వారు హర్షం వెలిబుచ్చారు. ధాన్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్లు గురునాథ్, జానకిరామ్, మదన్ కుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ 25 సంవత్సరాలుగా పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే 33 వేల మందిని భాగస్వాములను చేసినట్టు తెలిపారు. ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా మల్కాపురం సుహం సమాఖ్య హాస్పటల్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు.

చెస్ టోర్నీ విజేత రిత్విక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ వేదికగా నాలుగు రోజులు పాటు ఎంవిపి.కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ప్రాంగణంలో శ్రీ చెస్ అకాడమీ ఆధ్వార్యాన జరిగిన చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొదటి స్థానంలో విశాఖ చెందిన ఎం.వెంకటరిత్విక్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బీహార్‌కు చెందిన అశుతోష్ కుమార్, మోహిత్ కుమార్ సోనిలు నిలిచారు. ముఖ్య అతిథిగా హాజరైన వాగ్దేవి ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సురేష్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.